"నామీాద నీకు ప్రేమ లేదన్నమాటే కదూ?" అన్నాను దీనంగా.

"మహాబాగా కనిపెట్టారు. మధ్యాహ్నం పాపం ఫలహారం చేశారోలేదో. అన్నంతిందాముదరండి. అల్లంపచ్చడి చేశాను... తరువాత పోట్లాడదాం" అన్నది.

భోజనం అయిన తరువాత "కాస్తనయమేనా పైత్యం?" అన్నది కాంతం తమలపాకులకు ఈనెలు తీస్తూ; కాని అప్పటికి నాకోటి తోచింది. మనం అట్టే ఈవిరహం గిరహం ఆమె బుర్రలోకి ఎక్కిస్తేమా అంటే ప్రణయ కోపాలు నిజంగావచ్చినాయా, చలిలోను ఎండలోను వానలోను బైటపడి ఉండటం జరుగుతుందని జ్ఞాపకానికి వచ్చింది. అదీకాక ఆకలితో మాడిపోతూ నేను ఇంటికొస్తే, అప్పుడు వెంటనే ఇంత పచ్చడి అన్నం పెట్టింది. హాయిగాతిన్నాను. విరహమూ అదీ నేర్పామా అంటే చావే అని అనుకొని అయినా కాంతంతో బింకానికి "నీకు నిజమైనప్రేమ ఉంటే భర్తృవియోగం కోసం దుఃఖపడుతూ ఉండవా!" అన్నాను.

"చాలుచాలులెండి, నాటకాలకు వెళ్ళొద్దంటే వినరుగా? చెపుతాను జరగండి" అన్నది. కాంతం!?

## ప్రణయలేఖలు

౧

మళ్ళీ అదేమోస్తరు. ఉత్తరం రావటంతోనే నాముఖం

కళా విహీనం అయిపోయింది. ఏదో గొప్ప నేరం చేసిన వాడి లాగ ఆందోళన పొంది అఉత్తరాన్ని పుస్తకాల వెనక్కు తోసేస్తుంటే ఎక్కడినుంచి వచ్చిందో అనుమయానికి గానే వచ్చిందికాంతం. నేను తెల్లమొఖం వేయటం చూచి 'ఏమిటి చేస్తున్నా'రన్నది. ఏంచెప్పేది, ఏంలేదు అన్నాను. 'ఏం లేక పోవడమేమిటీ, ఏదో ఉంది, చెప్పరాదూ?' అంది కాంతం అసూయాగ్నిని కళ్లల్లో వెలిగించుకొంటూ.

"మున్న వచ్చిందే ఆ మాస్టరు ఉత్తరమే వచ్చింది" అన్నాను. 'ఇంకేం? ఉత్తరాలు వ్రాసుకోండి అని' అసూయతో దగ్ధం అవుతూ వున్న హృదయంతో వెళ్లిపోయింది. అసలు విషయం ఏమిటంటే నామీద ఆవిడకు ఏదోలోపలుంది.

ఈ అనుమానానికి కారణం ఏమిటంటే ఒకరోజున నేను పనిమీద పొరుగూరు వెళ్లటం తటస్థించింది. ఆరోజే ఒక ఉత్తరం వచ్చింది నాకు యెక్కడి నుంచో. అందులో ఒకపంక్తి మాత్రం ఇంగ్లీషు వ్రాసి ఉంది. సాధారణంగా నావుత్తరాలు మా ఆవిడ చూడదు. చూడాలన్న కుతూహలము లేదు కాని ఇంత క్లుప్తంగా వ్రాసి ఉంటం మూలాన ఏమిటా అని ఆవిడకు కుతూహలం కలిగింది. ఇంగ్లీషు బహుకొద్దిగావచ్చు అంటే అక్షరాలు గుర్తుపట్టటం బాగావచ్చు. పరిచయ శబ్ద సముదాయము ఒక నూరు మాటలకు మించి యుండదు.

ఉత్తరంలో Please remember అని ఒక్క చిన్న వాక్యమే ఉండటం మాపోట్లాటకు అంతా మూలం. చావు

...బులో ఏమౌనా అని భయం వేసిందట పాపం. క్రింద సంతకం ... శేషు అని ఉంది. Please అంటే తెలుసు కాని, remember అంటే తెలియదు. అందుకని వారప్పు కుర్రవాడికి చూపి 'ఇందులో ఏముంది అబ్బాయి' అని అడిగిందట.

వాడి తెలివి చూడండి! నాకర్మం కాలితే! "నన్ను ఎల్లప్పుడు జ్ఞాపకం వుంచుకో అని యెవరో వ్రాశారండీ" అని, క్రింద సంతకం ఎవరిది అంటే 'శేషు అనే అంతవరకు అక్షరాలు స్పష్టంగా ఉన్నవి. అక్కడ నుంచి వంకర గీతలు తప్ప యేమి తెలియటం లేదు.' అన్నాడట. సరే వాళ్లిద్దరికి ఒకే అభిప్రాయం కలిగింది. ఒక స్త్రీ వ్రాసి వుంటుంది అని శేషు అనివుంది కాబట్టి, శేషమ్మ అనో శేషారత్నం అనో శేషగిరి అనో పేరుగల స్త్రీ వ్రాసిన ఉత్తరం అని గట్టి నమ్మకం కలిగింది.

౨

చలిదినాలు కావటంచేత ఆరోజు పెందలాడే భోజనం చేసి మంచాలమీద చేరాము. కాంతం కథ సాగించింది.

"అయిందా అండీ. అప్పుడు ఆ ముండ ఎవరా అని ఊహ ఆలోచనలు పోయినవి."

'ముండ ఏమిటి?'

'అదే! ఆ ఉత్తరం వ్రాసింది.'

'ఉత్తరం వ్రాసినంత మాత్రాన తాడు తెంచావు?'

'ముండ కాకపోతే ముత్తైదువా. అంటే మొగుడి

యందు భక్తివిశ్వాసాలు కలవాళ్ళు పరాయి వాళ్ళకు పుస్తకాలు వ్రాస్తారాఏమిటి ?'

'ఎవరైనా స్నేహితురాండ్రు నాకు వున్నారని ఊహించక పోయినావా.'

'మీకూ ఆడవాండ్లకూ స్నేహమంటే ఒకటి. ఇదిలాంటే ఒకటా ? మొగవాడికి ఆడదానికి మధ్య ఉండగల సంబంధం ఒక్కటే. అది భార్యాభర్తలమధ్య వుండటం సహ్యతం, పర స్త్రీతో ఏరకపు సంబంధమైనాసరే వుండటం అసహ్యం.'

'సరే, సరే నిన్ను సమ్మించటం నా తరంగాదుగదా నన్ను సృష్టించిన వాడికైనా చేతకాదు. అది అట్లా ఉంచి ఏమి జరిగింది చెప్పు.'

'ఏముంది మీరు ఎవరితోనో స్నేహం చేశారని' అని నాకు స్పష్టమైంది '

ఊ అని చిరునవ్వు నవ్వి కాంతం చిక్కిపోయిన చెక్కిళ్ళను చూచి 'నాకు నాపిల్లలకు సేవచేయటంలో కదా ఈమె చెక్కిళ్ళుచిక్కి, హస్తములు కఠినమైనవి' అని అనుకుంటున్నాను.

'మళ్ళీ మీ మొఖం చూడాలని నేను అనుకోలేదు. ఇల్లు తగలబెడదా మనిపించింది. మాసెధన ఆడబిడ్డ మాచమ్మ నాకంటె సుఖపడుతోంది అనుకున్నాను. మీపుస్తకాలన్నీ ఈమాత్రం జ్ఞానం మీకు ఇయ్యలేని పుస్తకాలన్నిటిన్ని ఒక మాటు నిప్పు అంటిద్దా మనుకొన్నాను. కాని ఆక్షణంలో పెద్ద పిల్ల బడినుండివచ్చి అన్నం పెట్టమనటం, చంటిది కెవ్వున

కే కేసి ఒక్క పెట్టున ఏడవటం నా నిశ్చయాన్ని కార్యరూపం చెందకుండా ఆటంక పరిచినవి.

'పిల్ల పడ్డకపోయినట్లయితే యీపాటికి నీకు మాంచమ్మ రూపు వచ్చేదన్నమాటే !'

'ఊరుకోండి, మంగళ వాచకాలన్నీ...............'

'నివన్న మాటేకదా!...'

'ఊరుకోకపోతే—ఇక పోనియ్యండి. సరే పిల్లకు పాలిచ్చి పెద్దదానికి అన్నం పెట్టేసరికి మూడయింది. పొంగు చల్లారినా జ్వాల పెంపుతూనే ఉంది. కడుపులో మంట పుట్టింది. వళ్ళు తేలిపోవటం మొదలుపెట్టింది. పులకాయ బద్దలు కొట్టుకొంటే బాగుండననిపించింది. కాని పిల్ల కోసం ఏమి చేయలేక అబలనై ఊరుకొన్నాను.'

'మంచిది, మంచిది' అని నేను దర్జాగా అన్నాను. నావంక కోరచూపులు చూచి 'దేని విషయమై నిజం ఏమిటో మీరు చెపుతారా? నన్ను ఎందులోనన్నా పడి చావమంటారా ?' అన్నది చివరకు బాకులతో పొడిచినట్లు చూస్తూ.

ఆఖరుమాట వినేసరికి నాగుండె ఝల్లుమన్నది. ఆవిడ అంత పనీ చేస్తుంది. మహా మొండి. సాహసి. ఏజేంసేది. నిజమేమిటో నాకే తెలియదాయె. ఆవుత్తరం వ్రాసిన దెవరో నాకు దెలియలేదు. పేరుమాత్రం ఏదో ఇంగ్లీషులో ఉంది. S...h అని రెండు అక్షరాలూ, తరువాత వంకరగీతలు కనపడుతున్నవి. అయితే ఎవరు వ్రాశారో యీవుత్తరం నాకు తెలి

యదు. స్త్రీ మాత్రం కాదు. ఏమో, ఏమిటో మాయగానే ఉంది. "నామాట నమ్ము. నేను ఏస్త్రీతోను స్నేహం చేయ లేదు. నన్ను అనవసరంగా ఎందుకు అనుమానించి గృహంలో కల్లోలం తీసుకొస్తావు. నిజం నిలకడమీాద తెలుస్తుంది-" అని దీనంగా వేడుకొంటున్న గొంతుతో మనవి చేసికొని గడ్డం పట్టుకొని భోజనం చెయ్యమని బ్రతిమిలాడినాను. వెళ్ళి రెండు మెతుకులు కొరికింది. కాని ఆరాత్రి తెల్లవార్లు కాంతం మంచం మీాద మసులుతోనే ఉంది......దగ్గఱకు వెళ్ళితే కరుస్తుందని భయంవేసింది. శాలువ ముసుకు బిగించుకొని నిద్రపోయినాను.

## 3

రెండు రోజులదాకా ఇంట్లో ఎవరిసంగతి వాళ్ళదే. ఒకళ్ళ సంగతి ఒకళ్ళకి పట్టదు. విస్తట్లో అన్నంపెడితే తినటం. నాదారిన నేను వెళ్ళిపోవటం. ఆవిడ నాతో మాట్లాడలేదు. నేను ఆవిడను పలకరించనూ లేదు...... ఏ అఘాయిత్యంలేకుండా కాలం ఇట్లా గడిస్తే అంతే చాలునని నాగోల. ఆవిడ కోపం కాలంగడిస్తే చల్లారుతుందని నా నమ్మకం.

ఇది జరిగిన వారంరోజులకల్లా మళ్ళీ ఇంకో ఉత్తరంవచ్చింది. అందులో రెండోమాటు చెప్పుతూవున్నాను. 'జ్ఞాపకం తెచ్చుకోండి' అని వుంది. మళ్లీ అదే సంతకం. అయ్యాగారో! ఇదేదో నాకొంప తీయటానికే వ్రాస్తుందని అనుకొని రహస్యం బయటపడ్డదాకా ఈఉత్తరాలు చింపివేయటానికి ఇష్టంలేక పుస్తకాల వెనకాలకు తీసేస్తుంటే కాంతం రావటం, నన్ను

పట్టుకోవటం జరిగింది. అది సంగతి.

ఈ రెండోసారి ఉత్తరం సంగతిగూడా ఆవిడకు తెలిసింది. సహుమానిః రాసటంవల్ల ఉన్న సంగతి చెప్పక తప్పిందికాదు. కాని మళ్లీ మొదటకొస్తుందేమో అనుకొన్నాను. కాని అట్టి ప్రమాదం కనబడలేదు. సముద్రం మధ్యను తుపాను పడితే తీరవాసులకు కొంచం భయకారణమైనా ఆపద లేనట్టే ఆమె హృదయ మధ్యమంలో ఏం పుట్టిందో అక్కడే అణగిపోయింది. అయితే ఎవరైనా స్త్రీ నన్నెప్పుడైనా కలుసుకొని మాట్లాడి ఇట్లా వ్రాస్తున్నదా అని సందేహంకూడా కలిగింది. అట్లా జరిగినట్లు జ్ఞాపకం లేదు. ఇదేదో మాయగా ఉంది. నాకూ ఊహాలు బయలుదేరినవి. అవన్నీ వట్టి పగటి కలలు సుమండీ!

ఒక చక్కని స్త్రీ నన్ను ఇట్లా ప్రేమించి, ఉత్తరాలు వ్రాస్తున్నదని నేను జవాబు వ్రాయకపోతే తానే వచ్చి నన్ను కలుసుకొంటుందని ఒక ఊహ. కలుసుకొంటే ఎట్లా! కాంతంతో చెప్పటమా? చెప్పకపోవటమా? చెపితే కొరికేస్తుందే! చెప్పకుండానే రహస్యంగానే జీవించటం. ఆమెవల్ల నాకు ప్రేమానుభవమేకాక కావలసినంత ధనసహాయం దొరుకుతుందనీ ఈ సేవకావృత్తి మానెయ్యవచ్చుననీ మరొక ఊహ. ఉద్యోగం మానేస్తే కాంతం కనుక్కుంటుందని మరియొక ఉపఊహ. సరే మానెయ్యకుండా జీవిద్దామని సహాయ్యాఊహ. అక్కడ నుంచి కళ్ళముందు ఒక సినిమా ఫిలుము. మోటారులు,

తోటలు, విహారము, పెద్ద పట్టణాలు చూడటం, సినిమాలు, నాటకచేరీలు, ఏమిటో-ఏమిటో కనబడటం. ఇంతలో పసిపిల్లవాడు కెవ్వున కేకేసి ఏడ్వటం, తల్లి చంటివాడికి పాలిస్తూ లేవటానికి వీలులేక "ఏమండోయి, ఏం, వినపడటంలేదూ, వాడు అట్లా ఏడుస్తుంటే ఊరికే చూస్తూ ఉంటారేం. లేచి ఎత్తుకోండి అనటం, విధిలేక ఎత్తుకోటం. ఇదొకనాడు.

తివాసీపై కూర్చుని బాలీసుపై జేర్లబడి మళ్ళీ ఏమిటా ఆ ఉత్తరం అని ఇంకోసారి ఆలోచనలోకి దిగటం. అయితే నన్ను ఏ స్త్రీ అయినా ఎందుకు ప్రేమించి ఉత్తరం వ్రాస్తుందా, నేను ఏమీ చక్కనివాణ్ణిని కానే, అని సందేహం కలగటం, అప్పుడు ఊహాప్రపంచములోనుంచి ఒక గంధర్వుడు 'నీవు నల్లగాఉన్నా ముక్కు, మొఖం బాగా ఉంటాయి. ముఖంలో వుండే వంపులు, రేఖలు అందంగా ఉంటవి. నిజమైన అందం రంగులో లేదు' అని నచ్చచెప్పటం. అంశంగా ఒక విద్యావతి నన్నూ, నా తెలివినీ, నాకథారచనా నైపుణ్యాన్నీ గ్రహించి, మెచ్చుకొని నాతో స్నేహం కోరిందని అనుకోటం, అక్కడ నుంచి ఊహ ఊహాలు పూర్వము మోస్తరుగానే. సుకుమారితో స్నేహం, అయితే ప్రతిమారు ఆమె ధనవంతురాలు కావటం మాత్రం తప్పదు, నాదరిద్రం అంతా మాయం కావటం. కుచేలునికి ఐశ్వర్యం వచ్చినట్లు, అల్లాఉద్దీనుకు కావలసినదల్లా ఇచ్చే దీపపు సెమ్మె దొరికినట్లు నాకు ఆమనిషి, ప్రేయసి అనాలె-కాబోలు, దొరకటం, అక్కడనుంచి పూర్వము మోస్తరే

ఊహాలు రావటం పిల్లలకు సొమ్ములు చేయించినట్లూ, కాంతానికి ఒంటినిండా నగలుకొన్నట్లూ ఊహాలు. ఇక అంతుందా ఈ ఊహాలకు!

ఇంతలో పసివాడు గిన్నెలో తలకాయపెట్టి అది అందులో ఇరుక్కొని పోవటంమూలాన ఏడుస్తూఉండటం. చంటిది వంటి నిండా ప్రాసుకొని మంచంలో పొర్లుతూ ఉండటం, తల్లి పాత్రు గుడ్డలు దొడ్లో వుతుకుతూఉండటం ఈ hard reality చూసే సరికి నాగుండెల్లో అదేదో ఒకమాదిరిగా ఉండటం, ఇది ఇంకో అనుభవం. నా ఊహాకు సంబంధించిన కోరికలు ఇట్లా ఉన్నవి.

ఇది ఇంట్లోసంగతి. సంతోషం కాని సవ్వులాటలుగాని లేవు. జీవితం ఒక బండ మోయటం అనిపించింది. ఇంట్లో ఇల్లాలు ముక్కు ముడుచుకొంటే మగవాడికి ఎంత బరువో నాకు బోధపడ్డది. ఎట్లా ఈ సుడిగుండంలోనుంచి బైటపడాలో నాకు బోధపడలేదు. ఏపాపము ఎరుగని నాకు యీకర్మం ఏమిటి? ఇంటికి రావటం మానేద్దామా, లేకపోతే ఆత్మహత్య చేసుకొందామా, అని ఆలోచనలు బయలుదేరినవి. భార్యాభర్తల మిద్దరం యిట్లా వున్నాము. ఏమి చెయ్యాల్సింది తోచలేదు.

ఇంకోవారం గడిచింది. నేను బజారెళ్ళి పిల్లల కేదో తినే వస్తువులు కొనుక్కొని ఇంటికొచ్చాను. మా అబ్బాయి నన్ను వీధిలోనే, పరుగెత్తుకుంటూ, వచ్చి కలుసుకొన్నాడు. పెద్దది అరుగుమీద నుంచుని చూస్తున్నది. రెండోది నాన్న, నాన్న

అనిగంతులేస్తున్నది. ఎడబిడ్డ తల్లి చంకలోనుంచి దూకుతున్నాడు.

గడప ఎక్కడంతోనే పసివాణ్ణి అందించింది. సంతోషంతో ఎత్తుకొని ఉయ్యాలలో కెవ్వున కేకపెట్టి ఏడుస్తున్న దాన్ని ముద్దెట్టుకొని తెచ్చిన వస్తువులు పిల్లలకిచ్చి ఉయ్యాలలో దాన్ని ఎత్తుకొన్నాను.

ఇంతలో తల్లి వచ్చి పసివాణ్ణి తీసికొని పాలిస్తూ నా యెదుట కూర్చుని.

'శేషాచార్యులు యెవరండీ? అన్నది నవ్వుతూ.

'ఏ శేషాచార్లు' అన్నాను.

'ఎవరో శేషాచార్లు తెనాలిట' అంది ఆవిడ విరగబడి నవ్వుతూ.

ఆయన నా స్నేహితుడే, ఆయన ఏమైనా వచ్చి ఏదైనా చెప్పాడా యేమిటి అని భయం వేసింది. కాని నవ్వుతోంది కాబట్టి ధైర్యం తెచ్చుకొని,

'నాస్నేహితుడు ఒకాయన తెనాలిలో ఉన్నా' డన్నాను.

'ఆయనమీద మీరు కేసు పెట్టాలే' అన్నది.

'ఎందుకు? ఆయన ఏంచేశాడు?'

'ఏం చేశాడా? ఇంతకంటె ఏమి చేయాలె?'

'ఏం చేశాడో తెలియందే!'

'మనిద్దరికు పోట్లాటపెట్టి, పదిహేను రోజులు, సౌఖ్యంగా కాలం గడిపె కుటుంబములో నగడ తెచ్చిపెట్టాడు.'

ఆమన మంచివాడు పాపం! ఏం చేశాడు? ఆయన ఎప్పుడూ ఈ ఊసు ఎత్తలేదే? ఏమిటీ నవ్వు? ఈ ధోరణి ఏమిటి? ఉమా చేసిన గోలే ఇది. 'చూడండి! ఇదుగో ఉత్తరం' అని నాముందు పారవైచింది.

అందులో "మీకు రెండుమార్లు జ్ఞాపకం తెచ్చుకోమని వ్రాసినా ఏజవాబు వ్రాయకపోవటం మూలాన మీబావమరిది దగ్గరనుండి అడిగి పుచ్చుకొన్నాను మీరు ఇవ్వాలిసిన అయిదు రూపాయలు" అని ఉంది. నాకు నవ్వురాలేదు సుమండీ. అయితే యీ దస్కతు పూర్వము చూసినట్టుగనే ఉంది. 'నీకెట్లా తెలిసింది. శేషాచారిగారు అని' అన్నా.

"అమ్మా, మానయ్య వ్రాసిన ఉత్తరమేదే" అని అమ్మాయిని పిలిచింది, అది తన పెట్టెలోనుంచి ఒక కార్డు తెచ్చి యిచ్చింది. అది వాళ్ళ అక్కయ్యకు వ్రాసిన ఉత్తరం. అందులో వాడు—బావను డబ్బును జాగ్రత్తగా వాడుకొని అప్పులు చెయ్యవద్దని చెప్పు. శేషాచారిగారికి అయిదు రూపాయలు ఇయ్యాలట. ఆయన వచ్చి మీ బావ పంపలేదు. నీవు ఈయమని నన్ను అడిగి తీసికెళ్ళాడు. ఇటువంటి విషయం ఇది మొదటిసారి కాదు. ఆయన అందరిదగ్గరా అప్పులు చేయటం, వాళ్ళొచ్చి నాగొంతుమీద కూర్చోటం—"అని వ్రాసివుంది.

నవ్వాక తప్పింది కాదు. కాని నిక్షేపంలాంటి కాపరంలో తగూ పుట్టడానికి కారణం, ఆయన వివరంగా విషయం వ్రాయక పోవటమేగదా? ఆదస్కతుచేయడంలో- ఆ అజాగ్రత్త ఏమిటి?

ఆ దస్తూరి ఏమిటి. అక్లుప్తంగా వ్రాయటమేమిటి? దానిపిల్ల, ఎంత గోలయిందనీ. ఏమైనాసరే నాకు కలిగిన అసౌఖ్యానికి నష్టపరిహారార్థంగా ఆయనమీద పదిహేను వేలకు దావా వేయదల్చుకొన్నాను.

అమెరికా మొదలైన దేశాలలో ఇటువంటి దావాలు వేస్తారట. తప్పక దావా గెలిచి ఆయన వద్దనుంచి పదిహేను వేలు రాబడతాను. కాని ముందు కోర్టుఫీజుకూ, వాటికి రు 200 అయినా కావాలట. కాబట్టి ఈ కథ చదివి సంతోషించిన ప్రతివ్యక్తి, నాకు ఒక్కొక్క రూపాయి పంపండి. ఆడవాళ్లయితే అర్థరూపాయి. పిల్లలు అయితే పావలా.

# నీ లి కొం డ లు

రాత్రి పదిగంట లయింది. పిల్లలు నిద్రపోయినారు. తమల పాకుల పళ్లెం ముందుపెట్టుకొని కాంతం నాముందు తివాసీపైన కూర్చున్నది.

'మన కమల సంగతి విన్నారా?' అని పలకరించింది. కాంతం.

దీపంముందు కాంపోజిషన్ పుస్తకాలలో మునిగి వున్న నేను "కమల యెవరు?" అన్నాను.

"కమల యెవరా? అందాక వచ్చిందీ. మీ చెల్లెలు. కృష్ణయ్యచౌదరి కూతురు; చిన్నతనంలో మీరు పద్యాలు వ్రాస్తుంటే విని సంతోషిస్తుండేది."